# చిన్ని చిన్ని ఆశ





|| సింహప్రసాద్

"వచ్చే శనివారం మా గృహప్రవేశంరా. నువ్వూ, మా సిస్టరూ తప్పకుండా రావాలి" ఆహ్వాన పత్రిక అందిస్తూ చాటంత మొహంతో అన్నాడు నాగు – నాగేశ్వరరావు.

"తప్పకుండా వస్తాంరా" ఇన్విటేషన్ కార్డ్ తెరుస్తూ అన్నాను.

నిర్మల మంచినీళ్లు తెచ్చిచ్చింది. "పనులన్నీ పూర్తయ్యాయా అన్నయ్యగారూ"

"కరెంటు కనెక్షన్లాంటి చిన్నచిన్నవి తప్ప అన్నీ అనుకున్నట్లుగా పూర్తయ్యాయి. బిల్డింగ్ చాలా బాగా వచ్చింది. మీరే చూస్తారుగా!"

"సిటీ అవుట్‌స్కర్ట్స్ అయితేనేం ఇండిపెండెంట్ హౌస్. నేల విలువ ఎప్పటికీ పెరుగుతూనే ఉంటుంది" అన్నాను.

"అది నా డ్రీమ్, ఆశ, లక్ష్యం – అన్నీను. మీరంతా బరువవుతుందని చెప్పినా నేనందుకే వినలేదు. పొందికైన డాబా. చక్కని ఎలివేషన్. చుట్టూ ఖాళీ ప్రహరీగోడ... గేటుపైన ఆర్చీ, దాని మీద పూలతీగలు – అలాంటి ఇల్లుండాలన్నది నా జీవితాశయం. అది నెరవేరింది. మా అమ్మాయి ఆశ ఎన్నిరకాల పూలమొక్కలు పెంచాలో అప్పుడే ప్లాన్ చేసేసింది!" సంబరంగా చెప్పాడు.

"ఆశ చాలా తెలివైందిలెండి. ఏం చదువుతోంది. ఎయిత్తా... నైన్తా?"

"ఎయిత్ క్లాస్. టాపర్స్ సెక్షన్. దాన్ని గొప్ప ఇంజనీర్ని చెయ్యాలన్నది నా ఇంకో డ్రీమ్. అది ఎప్పటికీ గుర్తుండిపోయే ప్రోజెక్ట్ కట్టాలి..."

"ఆశ నీ కలని నెరవేరుస్తుందిలే. ఇంటికి పదిలక్షలదాకా అయ్యిందేమో కదా నాగూ"

"ఇంకా ఎక్కువే అయ్యిందిరా. హైదరాబాద్ వచ్చిన కొత్తలో సైట్ కొన్నాను గనుక గాని లేకపోతే స్థలం కొని కట్టడం నా తరమయ్యేది కాదు".

"లోను తీసుకున్నావా?"

"కొంత తీసుకున్నాను. మనూళ్లోని పొలం అమ్మేసాను"

"పంచేసుకున్నారా?" విషయం తెలుసు. అయినా అప్పుడే విన్నట్టు ఆశ్చర్యం అభినయించాను.

"పంచుకోవడం, నా వాటా అమ్మేసెయ్యడం అన్నీ అయ్యాయి".

"మీ అన్నయ్యలిద్దరూ పాపం భూమినే నమ్ముకున్నారు. వాళ్లకేదైనా అదనంగా ముట్టజెప్పడమో, ఆసరా చూపించడమో చేసావా?"

---

**దీపావళి కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ**

"ఎవరి బతుకు వాళ్లమే బతకలేకపోతున్నాం. ఇక వాళ్లకేం చెయ్యగలంరా. వస్తాను రా. ఇంకా చాలా కార్డులు పంచాలి. మీ ఇద్దరూ ముహూర్తం టైముకి వచ్చేయ్యాలి సుమా".

మేం తలలూపాం.

నాగు వెళ్లిపోయాడు.

నిట్టూర్చాను. చిత్రంగా చూసింది శ్రీమతి.

"అలా వున్నారేం?"

"మనిషి ఎంత స్వార్థపరుడో చూడు. రక్తం పంచుకుపుట్టిన అన్నలు పరాయి వాళ్లన్నట్టు



మాట్లాడుతున్నాడు!"

"ఆస్తుల గొడవలు భరతకాలం నుంచీ వున్నవేగా!"

"అయితే మాత్రం. వీడి అన్నలిద్దరూ చదువుకోలేదు. వ్యవసాయం మీదే ఆధారపడి వున్నారు. భూమి లేకపోతే వాళ్లెలా బతుకుతారన్నది ఆలోచించకుండా పెద్ద మనుషుల్ని కూర్చోబెట్టి పంపకాలేయించేసాడు!"

"హక్కులు గుర్తుంటాయి గాని బాధ్యతలెవరికి గుర్తుంటున్నాయండీ!"

"నాగూ వాళ్ల నాన్న నాగూని చదివించింది ఉమ్మడి సొమ్ముతో కదూ? వాడేదో కుటుంబానికి ఆసరా వస్తాడన్న ఆశతోనే కదా చదివించింది? డిగ్రీ చదివినందుకే కదా వీడికి మంచి జాబ్ వచ్చిందీ..."

"నిజమే మరి. అన్నగార్లకి భూమిని ఇచ్చేసి వుంటే బాగుండేది"

"అంతా కాకపోయినా పెద్దవాటా ఇచ్చినా బాగుండేది కదా. వూహూ... పెద్దల మాట వినకుండా సమానహక్కు అంటూ వాటాలేయించాడు. అంతటితో ఆగినా గుడ్డిలో మెల్లలా వుండేది. వెంటనే తన వాటా అమ్మకానికి పెట్టేసాడు. తర్వాత అమ్ముకోమన్నా విన్లేదు. మొత్తం వున్నదే నాలుగెకరాలు. అదీ ఏక ఖండిగా గాక నాలుగు ముక్కలుగా వుంది. మిగిలిన ముక్కల్లో వ్యవసాయం చెయ్యలేమని వీడి అన్నగార్లూ వీడితో పాటు అమ్ముకోక తప్పింది కాదు. పెద్దన్న భీమవరం వెళ్లిపోయాడు. చిన్నన్నని అత్తవారు తీసుకెళ్లారు. వాళ్లేవో ఆస్తులేర్పరచుకుంటే ఫర్లేదు... లేకపోతే దబ్బెంతలో కరుగుతుందీ!"

"రైతులు కూలీలవ్వడం... కూలీలు వలస



## రచయిత పరిచయం

'సింహప్రసాద్' పూర్తిపేరు 'చెలంకూరి వరాహ నరసింహప్రసాద్'. పశ్చిమగోదావరి జిల్లా మల్లవరంలో జన్మించిన వీరు ప్రస్తుతం హైదరాబాద్‌లో శ్రీశ్రీ ఒకేషనల్ జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. వీరు వ్రాసిన 184 కథలు, 42 నవలలూ వివిధ పత్రికలలో ప్రచురించబడ్డాయి. ఇటీవల వెలువడిన వీరి 'వివాహవేదం' గ్రంథం విమర్శకులచే సైతం ప్రశంసించబడింది.

పోవడం - మళ్లీ పాత కథే!" నిర్మల అంది.

ఎంచేతో నేనలా తేలిగ్గా సర్దుకుపోలేకపోతున్నాను!

* * *

సెకండ్ సాటర్‌డే అవడం వల్ల నాగూ వాళ్ల గృహప్రవేశ ముహూర్తానికే వెళ్లేం.

మొదట ఆవూదూడలను ఇంట్లోకి తీసుకెళ్లి, పిమ్మట గృహప్రవేశం చేసారు.

బంధువులు, మావూరికి చెందిన మిత్రులు, ఆఫీసువాళ్లూ చాలా మందే వచ్చారు. నాగూ అన్నగార్లు రాలేదు. పిలిచాడో లేదో మరి!

పిన్ని కూడా కన్పించకపోయేసరికి "నాన్నమ్మ ఏది ఆశా! రాలేదా?" నాగూ కూతుర్ని అడిగాను.

ఆవిడ బాధ్యతని నాగూ అన్నలకీ పంచా

దు!

"పాత ఇంట్లో వుంది. రమ్మంటే రావడం లేదంకుల్". దగ్గరుండి ఇల్లు కట్టుకోవడానికి వీలుగా ఆ దగ్గర్లోనే చిన్న పోర్షన్ తీసుకున్నాడు నాగు.

దగ్గరే అవడంతో ఆశను తీసుకుని పిన్ని దగ్గరకు వెళ్లాను.

నన్ను చూసి బోలుడు సంబరపడిపోయిం ది పిన్ని.

రమ్మంటూ ఆమె చెయ్యి పట్టుకుని లాగిం ది ఆశ.

పైటకొంగుతో కళ్లొత్తుకుంటూ ఇంటికి తాళం వేసింది.

"దీనికి నేనంటే ఎంత ఇదో!"

"కొడుకు ఇల్లుకట్టుకుని రంగరంగవైభోగం గా గృహప్రవేశం చేస్తోంటే నువ్వు రాలేదేం పిన్నీ..."

"వద్దామనే అనుకున్నాను... నా గోలకేం గాని కోడలు వచ్చిందిట్రా" ఆమె మాట మారు స్తోందని గ్రహించి తలూపి వూరుకున్నాను.

"ఆశా! ఆశా!..." బిగ్గరగా అరుస్తూ వెదుకు తున్న నాగు మమ్మల్ని చూసి తడబడ్డాడు.

మొఖంలో ఎన్నో రంగులు చకచకా మారి పోయాయి.

"నానమ్మని తీసుకొచ్చాను డాడీ".

"మంచిపని చేసావు. రామ్మా... రా... ఆశా నువ్వెళ్లి మమ్మీకి కన్పించు... నీ కోసం వెదుకు తోంది..."

"మా ఫ్రెండ్స్ వచ్చారా డాడీ..."

"ఇంకా రాలేదనుకుంటా. వస్తార్లేగాని నువ్వు లోపలికివెళ్లు..."

ఆశ చెంగున లోపలికెళ్లింది.

పిన్ని తడబడ్తూ వెళ్లింది.

"ఇల్లెలా వుందిరా? క్రిందాపైనా తిరిగిచూ సావా? రారా... చూపిస్తాను..."

నా చెయ్యి పట్టుకుని తీసుకెళ్లి మరీ ఇల్లం తా చూపించాడు నాగు.

ఎక్కడ టీవీ పెట్టేదీ, ఎక్కడ డైనింగ్ టేబుల్ వేసేదీ, ఎక్కడ బీరువా పెట్టుకునేదీ వివరించా డు.

పాలరాయి సెలక్షన్నుంచి కరెంటు స్విచ్చు ల వరకూ ఎంత జాగ్రత్తగా సెలక్ట్ చేసాడో చెప్పాడు.

మధ్య మధ్య బావుందంటూ మెచ్చుకోవ డం తప్ప వాడి సంబరానికి అడ్డుపడలేదు.

డాబా మీదికెళ్లాం. రాత్రి వర్షం పడింది కాబోలు అక్కడక్కడా నీరు నిలిచి వుంది.

ఆ చుట్టు ప్రక్కల కడుతోన్న కొత్త ఇళ్లను చూపిస్తూ వాటి యజమానుల గురించి, ఆ ప్రాంతానికి పట్టనున్న గొప్పదశ గురించీ చెబు తున్నాడు.

నా దృష్టి మాత్రం కరెంటు వైర్ల మీదే వుంది.

అది గమనించి ఇబ్బందిగా చూసాడు.

"హైవోల్టేజ్ లైనులా వుందే..."

"అవునదే. ఫీజులు, ముడుపులూ చెల్లిం చినా మా కింకా కరెంటు కనెక్షనివ్వలేదురా. కాసేపే కదాని దానికి వైరువేసి కరెంటు లా గాడు ఎలక్ట్రీషియన్..."

"కరెంటు సంగతలా వుంచు, ఎవరైనా పిల్లలకు తగిలితే ప్రమాదం కదా!"

"పిల్లల్ని పైకి రానివ్వడంలేదులే. ఇంకాసే పట్లో తీయించేస్తాను. నేను వద్దనే అన్నానురా మా ఎలక్ట్రీషియన్ విన్లేదు. ఇలా వైరువేసి కరెంటు లాక్కోవడం ఇవాళ రేపు అంతా చేస్తున్నదే అన్నాడు..." సంజాయిషీ ఇచ్చాడు.

"కరెంటు చౌర్యం నేరం. ఇలా వైరులాగటం ప్రమాదకరం..."

"నువ్వు మరీనురా... ఎవరో పిలుస్తున్నారు క్రిందికెళ్దాం రా..." గబగబా దిగిపోయాడు.

ఎవరూ పిలవలేదని మా ఇద్దరికీ తెలుసు. మౌనంగా అనుసరించాను.

నౌక బొమ్మని తెచ్చి చూపిస్తూ అంది నిర్మల "చెస్ పోటీల్లో ఫస్ట్ వచ్చిందని ఆశకి ఏదో సంస్థ వాళ్లు ప్రెజెంట్ చేసారటండీ".

బొమ్మ బావుంది. అది ఇవ్వబడిన కారణం నన్ను ముగ్ధుడ్ని చేసింది.

ఆశని పిలిచి ప్రత్యేకంగా అభినందించాను.

"వాంప్ పాటలకు డాన్సెయ్యడానికి పిల్లలు కూడా అమాయకంగా పోటీ పడుతున్నా, ఈ కాలంలో చెస్‌లో నువ్వు రాణించడం నిజంగా చాలా గ్రేట్ ఆశా" అన్నాను.

ఆ బొమ్మని హాల్లోని షోకేస్ మధ్యలో పెట్టాను.

"మమ్మీ ఏమంటుందో అంకుల్"

"తప్పకుండా మెచ్చుకుంటుంది. అదిక్కడే వుండాలి. దానిస్థానం ఇదే. పిల్లలంతా దీన్ని చూడాలి. నీ ప్రతిభ గురించి తెలుసుకోవాలి. స్ఫూర్తిపొందాలి..."

చుట్టూ చేరిన పిల్లలు చప్పట్లు కొట్టారు.

ఆశ బుగ్గలు సిగ్గుతో ఎరుపెక్కాయి.

సత్యనారాయణస్వామి వ్రతం మొదలైంది.

ఇంటి ముందు షామియానా క్రింద కుర్చీల్లో కూర్చుని అతిథులమంతా కబుర్లలోపడ్డాం.

ఆశ మాటి మాటికీ లోపల్నుంచొచ్చి చూసి వెళ్తోంది.

పిలిచి "ఎవరికోసం చూస్తున్నావ్" అడిగాను.

"నా ఫ్రెండ్ కోసం అంకుల్"

"వస్తుందిలే"

"నా స్కూల్ డైరీ తన దగ్గరుందంకుల్. నిన్న స్కూలుకు రాలేదని తీసుకెళ్లింది. త్వరగా తెచ్చిస్తే బావుణ్ణు... హోమ్‌వర్క్ చేసుకుందును"

"రేపు చేసుకోవచ్చులే రేపు హాలిడేయే కదా!"

"రేపటి పని ఇవాళే చేసెయ్యాలని మా టీచర్ చెప్పింది"

"ఇంకేం చెప్పిందేమిటి" నవ్వుతూ అడిగాను.

"త్యాగగుణం పెంచుకోవాలంది టీచర్".

మీ నాన్నకి లేనిదదే - అనుకుంటూ అభినందన పూర్వకంగా చూసాను.

గురువు మాటల మీద పిల్లల కెంత గురి!

ఎవరూ చూడకుండా ఓ ప్రక్కకి రమ్మని పిలిపించింది పిన్ని. వెళ్లాను.

"ఒరే అబ్బాయ్. ముసలోళ్లకి ఓ ముద్ద

పడేసే శరణాలయాలున్నాయంట కదా. నన్న క్కడ చేర్చి పుణ్యం కట్టుకోరా. వూరికే వుండన్లే. తోచినపనే చేస్తాను. అంట్లు తోముతాను, ఇల్లు వూడుస్తాను, వంట చేస్తాను..."

ఆవిడ కళ్లనిండా నీళ్లు! వాటి వెనుక సము ద్రమంత దైన్యం!

"నాగు బాగా చూసుకోవడంలేదా పిన్నీ?"

"పెద్దోడు చూస్తాడని వీడు, వీడు చూస్తాడ ని పెద్దోడు... అత్తారింట్లో తలదాచుకున్నామని రెండోవాడు. ఎందుకులేరా... కడుపు చించు కుంటే కాళ్లమీద పడుతుంది..."

"అది కాదు పిన్నీ..."

ఎప్పుడొచ్చిందో ఏమో ఆశ గబుక్కున నానమ్మని చుట్టేసి "మా ఇంట్లోంచి వెళ్లిపోతా వా నానమ్మా" అనడిగింది బేలగా.

"అబ్బెబ్బే. మీ అందర్నీ వదిలి నేనెక్కడికెళ్తా నే పిచ్చిదానా. పద పద..." అంటూ మనవరా ల్ని తీసుకెళ్తూ నావంక అర్థింపుగా చూసింది.

గుండె బరువెక్కగా తలాడింపుతో సమాధా నమిచ్చాను.

వ్రతం పూర్తయ్యింది. భోజనాలు మొదల య్యాయి. భోంచేసాక పెద్దలం కబుర్లలో ప డ్డాం. పిల్లలు ఆటల్లో పడ్డారు. నాగు దంపతు ల్ని అభినందించి ఒక్కొక్కరూ శెలవు తీసుకుం టున్నారు. మేం కూడా వెళ్లడానికుద్యుక్తుల య్యాం.

నాగు భార్యకి, పిన్నికీ చెప్పి ఆశ కోసం చూస్తోంటే మేడ మీంచి ఒకమ్మాయి ఆర్తనాదం వినిపించింది.

అదుర్తోన్న గుండెల్తో పరుగున వెళ్లామం తా. నీటిలో చలనరహితంగా పడివుంది ఆశ! కరెంటుషాక్ కొట్టిందన్నారు పిల్లలు.

ఇంతదాకా తూనీగలా ఎగిరిన ఆశ ఉలు కూ పలుకూ లేకుండా కట్టెలా...!

నాడి చూసాను. అందలేదు!

ఆశ చావక ఆశను భుజానవేసుకుని దగ్గ ర్లోని ఆసుపత్రికి తీసుకెళ్లాం. ఆ హఠాత్సంఘట నకి షాక్‌కి గురైన నాగు, అతడి భార్యా అయో మయంగా చూస్తూ అనుసరించారు.

డాక్టర్ పెదవి విరిచేడు. ఘొల్లుమన్నారు నాగు దంపతులు.

గుండెల్లో బడబాగ్నులు బ్రద్దలవుతోంటే కళ్లనుండి కన్నీళ్లు అవిరామంగా జారిపోతూం టే ఇంటికి తిరిగివచ్చాం.

నట్టింట చాపమీద నిర్జీవంగా పడివుంధి ఆశ.

పిన్ని, బంధువులూ శోకాలు తీస్తున్నారు. ఆశ తల్లి సొమ్మసిల్లిపోయింది. నాగు దుఖం వర్ణనాతీతంగా వుంది.

అప్పుడొచ్చింది అమ్మాయి. కళ్లెదుట కట్టె లావున్న మిత్రురాల్ని చూసి మ్రాన్పడిపోయిం ది. ఆమె చేతిలోని డైరీ జారిపడింది.

రేపటిపని ఇవాళే చేసెయ్యాలన్న ముందు చూపు గల ఆశ ఎంత ముందుగా వెళ్లిపోయిం దీ! – అనుకుంటూ డైరీని చేతుల్లోకి తీసుకున్నా ను.

డైరీ యధాలాపంగా తెరిచాను.

మొదటి పేజీలోని ఆ అక్షరాలు చూసి శిలనైపోయాను!

"నా కళ్లను దానం చేస్తున్నాను.

– ఆశ"